కలిసి పనిచేద్దాం.. కోలగట్లను గెలిపిద్దాం..



పార్టీలో చేరిన వారితో వైఎస్సార్‌సీపీ నాయకులు

- వైఎస్సార్‌సీపీ నాయకులు
- టీడీపీ, జనసేన పార్టీలను వీడిన 25 కుటుంబాలు
- వారికి కండువాలు వేసి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించిన నాయకులు

విజయనగరం: పార్టీలో ఇప్పటికే కుటుంబ సభ్యులుగా ఉన్న వారితో పాటు నూతనంగా పార్టీలో చేరుతున్న వారంతా కలిసికట్టుగా పనిచేసి రానున్న సార్వత్రిక ఎన్నికల్లో విజయనగరం ఎమ్మెల్యేగా కోలగట్ల వీరభద్రస్వామి గెలిపించుకునేందుకు కృషి చేద్దామని వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ శెట్టివీరవెంకట రాజేశ్వరరావు పిలుపునిచ్చారు. నగరంలోని 50 డివిజన్ వైఎస్సార్‌నగర్ ప్రాంతానికి చెందిన 25 కుటుంబాలు టీడీపీ, జనసేన పార్టీలను వీడి వైఎస్సార్‌సీపీలోకి చేరాయి. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి నివాసంలో గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో వారందరికీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆశపు వేణు, రాజేష్ మాట్లాడుతూ.. నగరంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి చేసిన అభివృద్ధి, నాయకత్వానికి ఆకర్షితులై పలువురు వైఎస్సార్‌సీపీలో చేరడం శుభ పరిణామమన్నారు. 50వ డివిజన్ పరిధిలోని వైఎస్సార్‌నగర్ ప్రాంత అభివృద్ధికి డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి కట్టుబడి ఉన్నారని చెప్పారు. ఇప్పటికే రూ.3 కోట్ల వ్యయంతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. కాలువల పనులు చివరి దశకు చేరుకున్నాయని తెలిపారు. భవిష్యత్‌లో సామాజిక భవన నిర్మాణంతో పాటు మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు కోలగట్ల కృతనిశ్చయంతో ఉన్నారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో కోలగట్ల గెలుపు ఖాయమని.. చేరికలతో పార్టీ మరింత బలోపేతం అవుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జ్‌లు బొద్దాన అప్పారావు, మారం బాలబ్రహ్మారెడ్డి, 50వ డివిజన్ పార్టీ అధ్యక్షుడు తోనంగి జగన్నాథరెడ్డి, నాయకులు రఘురాం, గోపి, సలీం, కృష్ణ, నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

సారా తయారీపై ఉక్కుపాదం..



దేవుని కణపాకలో స్వాధీనం చేసుకున్న బెల్లం ఊట (ఫైల్)

- విస్తృత తనిఖీలు చేపడుతున్న ఎస్‌ఈబీ అధికారులు

నెల్లిమర్ల: సారా తయారీపై ఎస్‌ఈబీ అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. నెల్లిమర్ల స్టేషన్ పరిధిలోని సారా తయారీ కేంద్రాలపై ఎడాపెడా దాడులు చేస్తున్నారు. తయారీదారులపై కేసులు నమోదు చేసి బెంబేలెత్తిస్తున్నారు. వివరాల్లోకి వెళితే... నెల్లిమర్ల స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ) పరిధిలో నెల్లిమర్ల, గుర్ల మండలాలతో పాటు నెల్లిమర్ల నగర పంచాయతీ ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో సారా తయారీ కట్టడికి ఎస్‌ఈబీ అధికారులు గట్టి చర్యలు చేపడుతున్నారు. ముఖ్యంగా సారా తయారీకి పేరుగాంచిన గుర్ల మండలంలోని దేవుని కణపాక, పకీరుకిట్టలి గ్రామాలతో పాటు నెల్లిమర్ల మండలంలో అప్పయ్యపేట, నీలంరాజుపేట గ్రామాలపై కూడా గట్టి నిఘా పెట్టారు. ప్రతిరోజూ ఆయా గ్రామాలను సందర్శిస్తున్నారు. ఎవరైనా సారా తయారు చేస్తే అటువంటివారిపై కేసులు బనాయిస్తున్నారు. రెండు నెలల్లో 13,950 లీటర్ల బెల్లపు ఊట, 218 లీటర్లు సారా, 10 కిలోల అమ్మోనియాను సీజ్ చేశారు. అలాగే 54 మంది తయారీదారులపై కేసులు నమోదు చేసి 30 మందిని అరెస్ట్ చేశారు. అలాగే 574 మంది మద్యం బాటిళ్లు, 10 బీర్లు, ఒక వాహనం సీజ్ చేసి 27 మందిపై కేసులు నమోదు చేసి వారిని అరెస్ట్ చేశారు.



సీజ్ చేసిన సారాతో ఎస్‌ఈబీ అధికారులు (ఫైల్)

కఠిన చర్యలు తప్పవు



ఎలక్షన్ కోడ్ అమలులో ఉంది. ప్రతిచోటా గట్టి నిఘా పెట్టాం. సారా తయారు చేసినా, విక్రయించినా, రవాణా చేసినా చట్టపరమైన చర్యలు తప్పవు.

– టి తేజోవెంకట్‌కుమార్, ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్, నెల్లిమర్ల.

క్లుప్తంగా

సేంద్రియ పద్ధతులతో అధిక దిగుబడులు



మాట్లాడుతున్న ఐసీఆర్‌పీ కమల

పూసపాటిరేగ: సేంద్రియ పద్ధతులతో అధిక దిగుబడులు సాధించవచ్చునని ఐసీఆర్‌పీ విక్రం కమల అన్నారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సేంద్రియ పద్ధతులతో సాగు చేయడం వల్ల తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో వెలుగు సిబ్బంది పెంటంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

క్షయవ్యాధి నివారణపై అవగాహన



క్షయవ్యాధి నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

పూసపాటిరేగ: క్షయవ్యాధి నివారణపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి రాజేష్‌వర్మ అన్నారు. గురువారం స్థానిక సిరి వాటర్ పరిశ్రమలో క్షయవ్యాధి నివారణ దినోత్సవంలో భాగంగా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు వారాలకు మించి దగ్గు ఉంటే కఫం పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. టీబీ నిర్ధారణ జరిగితే ఉచితంగా మందులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, ఎంఎల్‌పీహెచ్‌పీఓ సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ పర్యటన



కొండగుంపాంలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ రామారావు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొండగుంపాం, గరికిపేట గ్రామాల్లో ఎంపీడీఓ జి. రామారావు గురువారం పర్యటించారు. ఆయా గ్రామాల్లో సచివాలయాలను సందర్శించి సిబ్బందితో మాట్లాడారు. ఎన్నికల నియమావళిని పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలు, ఫొటోలను తొలగించాలని సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విజయనగరం: విద్యుత్ నిర్వహణ పనుల్లో భాగంగా నగరంలోని బాబామెట్ట సబ్‌స్టేషన్ పరిధిలో గల ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీ ఈపీడీసీఎల్ అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి 10.30 వరకు ద్వారకానగర్ మొదటి లైన్ నుంచి 8వ లైన్ వరకు.. విజ్జి స్టేడియం ఏరియా, అశోక్‌నగర్, రాజానగర్ లే అవుట్, పీజీ కాలేజీ ఏరియా, ఫూల్‌బాగ్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. నిర్వహణ పనుల అనంతరం సరఫరాను పునరుద్ధరిస్తామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నలుగురు వలంటీర్ల తొలగింపు

విజయనగరం అర్బన్: ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘిస్తూ రాజకీయ పార్టీల ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న నలుగురు వలంటీర్లను తొలగించినట్లు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్.కోట మండలంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న అలుగుబిల్లి గ్రామ సచివాలయ పరిధిలోని వలంటీర్లు బత్తుల కృష్ణ, బోనెల మనోజ్ కుమార్‌లను విధుల నుంచి తొలగించినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా గరివిడి మండలం చుక్కవలసకు చెందిన ఇద్దరు వలంటీర్లు కిల్లాన ప్రసాద్, రేవళ్ల త్రినాథ్‌లను తొలగించామన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

జామి: వేసవి నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని మండలంలోని స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులకు ఎంపీడీఓ తిరుమలరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున సర్వసభ్య సమావేశం సాదాసీదాగా కోడ్ నిబంధనలకు లోబడి సాగింది. సమావేశంలో ఎంపీడీఓ ప్రవేశపెట్టిన పలు తీర్మానాలను సభ్యులు ఆమోదించారు. ఎంపీపీ సబ్బవరపు అరుణ, వైస్ ఎంపీపీలు గేదెల వెంకటరావు, ఎన్నింటి విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సీతంలో హ్యాపీనెస్ దినోత్సవం



జూట్ తయారీ వస్తువులతో అతిథులకు స్వాగతం పలుకుతున్న విద్యార్థినులు

విజయనగరం అర్బన్: గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాలలో అంతర్జాతీయ హ్యాపీనెస్ దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 'పాస్వర్డ్ టు హ్యాపీనెస్' అనే అంశంపై ప్రత్యేక (జస్ట్ ఏ మినిట్) కార్యక్రమం చేపట్టారు. కళాశాల హాస్టల్ విద్యార్థులు తయారు చేసిన ఒరిగామి, జూట్ ఆధారిత వస్తువులతో అతిథులకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు మాట్లాడుతూ.. ప్రజలు ఎల్లప్పుడూ చిరునవ్వుతో ఆనందంగా ఉండాలనే ఉద్దేశంతో ఐక్యరాజ్య సమితి మార్చి 20న ఆనంద దినోత్సవం జరుపుకోవాలని నిర్ణయించిందన్నారు. అనంతరం వివిధ సాంస్కృతిక కళా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అదే విధంగా ప్రపంచ కవితా దినోత్సవం కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ గురుకుల కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ ఎ.కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామ్మూర్తి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ దామోదర నాయుడు, సీహెచ్ వెంకటలక్ష్మి, చీఫ్ వార్డెన్ కెప్టెన్ సత్యవేణి, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన నామినేషన్ల ప్రక్రియ

- 28న న్యాయవాద సంఘ ఎన్నికలు



మీడియాతో మాట్లాడుతున్న ఎన్నికల అధికారులు

సాక్షి ప్రతినిధి, విజయనగరం: విజయనగరం జిల్లా కేంద్ర న్యాయవాదుల సంఘ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ గురువారంతో ముగిసింది. సంఘ అధ్యక్ష బరిలో అల్లాడ హరీష్, కంటుభుక్త శ్రీనివాసరావు, సరిపల్లి నాగేశ్వరరావు నిలవగా, ఉపాధ్యక్ష పదవికి దాసరి ఈశ్వరరావు, పి.శివప్రసాద్‌లు ఉన్నారు. జనరల్ సెక్రటరీ పదవికి దాసరి ఈశ్వరరావు, వి.జి.సంతోష్ నామినేషన్లు దాఖలు చేశారు. సంయుక్త కార్యదర్శి పదవికి సారిక సతీష్, వైపీవీఆర్ మూర్తిలు పోటీ పడుతున్నారు. కోశాధికారి పదవికి కె.చినప్పారావునాయుడు, బీంపల్లి రవి ముఖాముఖీ బరిలో తలపడనున్నారు. కాగా, స్పోర్ట్స్, అండ్ కల్చరల్ సెక్రటరీ పదవికి ఎన్.నాగేశ్వరరావు, గ్రంథాలయ కార్యదర్శి పదవికి ఎస్.పీటర్ మార్టిన్, మహిళా ప్రతినిధి పదవికి పి.రుక్మిణి ఒక్కొక్క నామినేషన్ దాఖలు చేయడంతో దాదాపు ఈ పదవులు ఏకగ్రీవమైనట్టే. నామినేషన్ల పరిశీలన ప్రక్రియ 23వ తేదీ శనివారం వరకు ఉండటంతో ఆ రోజు తుది జాబితాను విడుదల చేస్తామని ఎన్నికల అధికారులు పి. శ్రీరామ్మూర్తి, కె.రవిబాబు, ఏవిఎల్ పద్మజ తెలిపారు. కాగా, 28న న్యాయవాదులు సంఘ ఎన్నికలు నిర్వహించనున్నట్టు అధికారులు వెల్లడించారు.

సోదరా.. కాస్త ఆలోచించవా..

డ్రైవింగ్ చేసిన ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరిస్తే ఎన్నో ప్రమాదాలను అరికట్టవచ్చు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు నిబంధనల మేరకు డ్రైవింగ్ చేస్తే వారితో పాటు రోడ్డుమీద రాకపోకలు సాగించేవారు క్షేమంగా ఇళ్లకు చేరుకుంటారు. అయితే ఇటీవల కాలంలో చాలామంది ఫోన్‌లలో మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తూ ఎన్నో ప్రమాదాలకు కారణమయ్యారు. ఇటువంటి వారిపై పోలీసులు కేసులు నమోదు చేస్తున్నా వారిలో మార్పు రాకపోవడం శోచనీయం. జిల్లా కేంద్రంలో పలువురు ద్విచక్ర వాహనదారులు సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ గురువారం సాక్షి కంటపడ్డారు.











– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

నియమావళి అతిక్రమిస్తే కేసులు



సమావేశంలో మాట్లాడుతున్న ఏఆర్‌ఓ ధర్మరాజు

నెల్లిమర్ల: ఎవరైనా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అతిక్రమిస్తే కేసులు నమోదు చేయాలని ఏఆర్‌ఓ డి. ధర్మరాజు అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై ఎంపీడీఓ జి. రామారావు ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఎన్నికల ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలు చేయాలని సూచించారు. ముఖ్యంగా ఆయా గ్రామాల్లో ఎన్నికల కమిషన్ అనుమతి లేకుండా ప్రచారం చేయరాదని స్పష్టం చేశారు. పార్టీల జెండాలు, వాల్‌పోస్టర్లు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఈఓపీఆర్‌డీ కె. సింహాద్రి, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహన తప్పనిసరి

బొండపల్లి: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కాలేజ్ ఎన్ఎస్ఎస్ యూనిట్ – 2 పీఓ బొత్స ధర్మారావు అన్నారు. మండలంలోని గొట్లాంలో ఎన్ఎస్ఎస్–2 ఆధ్వర్యంలో ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో స్థానిక పీహెచ్‌సీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

దివ్యాంగుల అభ్యున్నతికి కృషి



మాట్లాడుతున్న ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ సెంటర్ అధ్యక్షురాలు ప్రమీల జి.షరాఫ్

చీపురుపల్లిరూరల్(గరివిడి): దివ్యాంగుల అభ్యున్నతికి, వారి జీవితాల్లో మార్పు తీసుకువచ్చేందుకు గరివిడి ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ సెంటర్ కృషి చేస్తోందని ఆసంస్థ అధ్యక్షురాలు ప్రమీల జి.షరాఫ్ తెలిపారు. గరివిడిలోని ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ సెంటర్‌లో దివ్యాంగ పిల్లల తల్లిదండ్రులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మా ట్లాడుతూ తమ సంస్థ ఎంతోమంది దివ్యాంగులకు ఆసరాగా నిలుస్తోందని చెప్పారు. దివ్యాంగులకు విద్యాబోధన చేయడమే కాకుండా, వారి ఆసక్తికి తగిన విధంగా వివిధ అంశాల్లో శిక్షణ ఇస్తున్నామని వివరించారు. తమ సంస్థ ద్వారా చదువుకున్న దివ్యాంగుల్లో చాలా మంది ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగులుగా స్థిరపడ్డారన్నారు. ఎంతో మంది దివ్యాంగులకు రుణాలు ఇప్పించి, స్వయం ఉపాధి కల్పించామని చెప్పారు. అనంతరం దివ్యాంగుల మానసిక,శారీరక ఆరోగ్యం కోసం నాగపూర్ వైద్యులు ప్రత్యేక యోగా ఆసనాలపై అవగాహన కల్పించారు.

ఎల్లారమ్మ జాతరకు పోటెత్తిన ప్రజలు



ఎల్లారమ్మ జాతరలో పాల్గొన్న భక్తుల సందడి

గజపతినగరం: మండలంలోని కాలంరాజుపేటలో జరుగుతున్న ఎల్లారమ్మ జాతకు గురువారం భక్తులు పోటెత్తారు. మహిళా భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమ, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా సర్పంచ్ గేదెల ఈశ్వరరావు, గ్రామపెద్దలు ఏర్పాట్లు చేశారు. గజపతినగరం, డోలపాలెం, సీతారామపురం, పిడిశీల, తదితర గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఓటు వజ్రాయుధం

గజపతినగరం రూరల్: ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం లాంటిదని, ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని గజపతినగరం నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు, విజయనగరం ఆర్డీఓ సూర్యకళ అన్నారు. ఓటు హక్కు వినియోగంపై మండల కేంద్రంలో బీఎల్‌ఓలు, ఎన్నికల సిబ్బందితో కలిసి గురువారం అవగాహన కార్యక్రమాలు నిర్వ హించారు. ముందుగా ద్విచక్ర వాహనాలతో ర్యాలీ చేశారు. నాలుగు రోడ్ల కూడలి వద్ద మానవహారం ఏర్పాటు చేశారు. బస్సులో వెళ్తున్న ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఆర్డీఓ మాట్లాడుతూ మనం వేసే ఓటు దేశ భవిష్యత్‌ను నిర్ణయిస్తుందని, ప్రలోభాలకు లొంగకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం రాజకీయ పార్టీల నాయకులతో తహసీల్యార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు.

క్షయ వ్యాధిపై అవగాహన



వేపాడ: ఆదర్శపాఠశాలలో క్షయవ్యాధి లక్షణాలపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ధరణి

వేపాడ: క్షయ వ్యాధి లక్షణాలపై వేపాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ధరణి గురువారం స్థానిక ఆదర్శ పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, క్షయవ్యాధి సోకిన వారికి ఆరు లక్షణాలు ఉంటాయన్నారు. ఒకటి లేదా రెండు వారాలకు పైబడి దగ్గు, ఛాతిలో నొప్పి, ఆకలి లేకపోవుట, బరువు తగ్గడం, సాయంత్రం వేళల్లో జ్వరం రావడం, కఫంలో రక్తం పడుట వంటి లక్షణాలు కనబడితే వెంటనే పీహెచ్‌సీలో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఈశ్వరరావు, సీహెచ్‌ఓ ఆంజనేయులు, హెచ్‌జి రమణ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

క్షయవ్యాధి రహిత సమాజమే లక్ష్యం

కొత్తవలస : క్షయవ్యాధి రహిత సమాజమే అందరి లక్ష్యం కావాలని వియ్యంపేట పీహెచ్‌సీ డాక్టర్ గోపాలకృష్ణ అన్నారు. మండలంలోని తుమ్మికాపల్లి సచివాలయం పరిధి సీతంపేటలో క్షయవ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వాస్పత్రుల్లో మెరుగైన చికిత్స లభిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సత్యారావు, బి.శ్రీనివాసరావు, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.